క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: గోపాల్‌రావుపేట శ్రీభక్తాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కాసారపు పర్శరాంగౌడ్, ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి, పూదారి మల్లేశం, శ్రీకాంత్, గంగయ్య, ఆనందం తదితరులు ఆయనను సత్కరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

రామడుగు: షానగర్ ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని, రాజ్యాంగాన్ని చదవాలని, చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎంపీపీ కలిగేటి కవిత, బీఆర్ఎస్ నాయకులు, స్వేరో నాయకులు పాల్గొన్నారు.

మాదిగ ఐక్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కిరణ్



హుజూరాబాద్: కందుగులకు చెందిన ఇమ్మడి కిరణ్ మాదిగ ఐక్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కిరణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం వారి సూచనల మేరకు పని చేస్తానని పేర్కొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అజయ్



హుజూరాబాద్: పట్టణానికి చెందిన గోస్కుల అజయ్ మరోసారి ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర నాయకులకు అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

సంయుక్త కార్యదర్శిగా రాజు



శంకరపట్నం: ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శంకరపట్నం మండలంలోని గద్దపాకకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి అలివేలి రాజు ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి గురువారం తెలిపారు. విద్యారంగం, నిరుద్యోగం, శాంతిభద్రతలు, మహిళా రక్షణ, సామాజిక సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు.

బస్‌షెల్టర్లు ప్రారంభం


బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న దాత శివన్న

ఇల్లందకుంట/జమ్మికుంట: మండల కేంద్రంతోపాటు శ్రీరాములపల్లి గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం జమ్మికుంట మండలంలోని అంకుశాపూర్‌కు చెందిన బామండ్లపల్లి శివన్న తన తండ్రి మహాలింగం జ్ఞాపకార్థం బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. గురువారం ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టిపెల్లి శివాజీ, కన్వీనర్ జెండా రాజేశ్, జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావులతో కలిసి వాటిని ప్రారంభించారు. అనంతరం నాయకులందరూ ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. మండల అధ్యక్షుడు ఇరువాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. మడిపల్లిలో కనగర్తి, అంకుశాపూర్ వెళ్లే కూడలి వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను అన్నదమ్ములు శివన్న, శంకర్‌రావు గురువారం ప్రారంభించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన నియామకం

హుజూరాబాద్: రంగాపూర్‌కు చెందిన సుంకరి రాజేందర్‌ను తెలంగాణ రజక సంఘం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర బాధ్యులకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవం.. ఆరట్టు ఉత్సవం


చొప్పదండి : శోభాయాత్రలో అయ్యప్ప స్వాములు


కొత్తగట్టు కోనేరులో స్వామివారి ఉత్సవమూర్తులకు జలాభిషేకం


కేశవపట్నంలో అయ్యప్ప దీక్షాపరుల ర్యాలీ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి కోనేరులో గురువారం అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తులకు దీక్షాపరులు, అర్చకులు జలాభిషేకం చేశారు. మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం నుంచి వంకాయగూడెం అయ్యప్పస్వామి ఆలయం వరకు ఆరట్టు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. దీక్షాపరులు భజన చేస్తూ, సంకీర్తనలు పాడారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సుమన్‌శాస్త్రి, గురుస్వామి చింతం సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ తనుకు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల పూజ

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో 41 రోజుల మండల పూజ గురువారం ముగిసింది. అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో 108 కలశాలతో స్వామివారికి పూజ, బలిహరణం, లక్ష్మీగణపతి హోమం, ప్రధాన హారతి, ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజారోహణం జరిపారు. అయ్యప్ప భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాలధారులు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జయేందర్, రాజేంద్రప్రసాద్, మనోహర్, వీర్రాజు, జగదీశ్వర్, ప్రతాప్‌రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప శోభాయాత్ర

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, హోమం, గోపూజ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిపారు. అనంతరం కోటిలింగాలలో అయ్యప్ప స్వామికి పంబారట్టు జరిపి, నదీ స్నానం చేయించారు. పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


జమ్మికుంట : 108 కలశాలను తీసుకువస్తున్న దీక్షాస్వాములు


స్వామివారికి కలశ పూజ చేస్తున్న అర్చకులు



శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో వ్యవసాయ బావులకు వేసిన విద్యుత్ స్తంభాల్లో రెండు వంగిపోయాయి. అవి విరిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ట్రాన్స్‌కో లైన్‌మెన్, సెల్ నంబర్: 83339 94628

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఎల్‌ఎండీ నీరు విడుదల చేయాలి


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: యాసంగి సీజన్‌కు సంబంధించి నార్లు ముదురుతున్నాయని, ఎల్‌ఎండీ నీటిని వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌ఎండీలో 23 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉన్నప్పటికీ, విడుదల చేయడంలో ఎస్సారెస్పీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వరినార్లు ముదిరిపోతే దిగుబడి తగ్గి, రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. రెండు రోజుల్లో నీటి విడుదల చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుల తడకగా ఉందని, ప్రజాప్రతినిధుల జోక్యంతో అర్హులను కాకుండా లబ్ధిదారులను ఇష్టం వచ్చినట్లు గుర్తించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలు నిర్వహించాలనుకోవడం రాష్ట్రాల హక్కులను హరించడమేనని, పేర్కొన్నారు. జమ్మికుంట, ఇల్లందకుంట మండల కార్యదర్శులు శీలం అశోక్, చెల్పూరి రాములు, నాయకులు పాల్గొన్నారు.

'దామన్న' విగ్రహానికి గ్రీన్‌సిగ్నల్

- ఏర్పాటుకు జీవో విడుదల చేసిన సర్కారు


ప్రభుత్వం ఇచ్చిన జీవో

సాక్షి ఎఫెక్ట్

వీణవంక: మండలంలోని మామిడాలపల్లికి చెందిన మాజీ మంత్రి దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైట్ అండ్ వైట్ లీడర్‌గా గుర్తింపు పొందిన దామన్నను మాజీ సీఎం, దివంగత ఎన్టీఆర్ కమలాపూర్ కుర్రోడిగా పిలిచేవారు. మూడుసార్లు మంత్రిగా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన దామన్న 2012లో అనారోగ్యంతో మృతి చెందాడు. వివిధ పార్టీల నాయకులు ఆయన పేరు చెప్పుకొని, ఎన్నికల సమయంలో ఓట్లు వేయించుకున్నారు. కానీ, దామోదర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయలేదు. విశేష సేవలందించిన ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని గతంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఈ విషయమై ఇటీవల 'సాక్షి'లో 'దామన్న'ను మరిచిన తమ్ముళ్లు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించారు. విగ్రహ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఓకే చెప్పింది. మానకొండూర్ మండలం సదాశివపల్లి క్రాస్ వద్ద(తీగల వంతెన క్రాస్) విగ్రహం ఏర్పాటు చేయడానికి గురువారం జీవో విడుదల చేసింది. సర్కారు నిర్ణయంపై దామన్న అభిమానులు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు ఎమ్మెల్యే సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి


రామడుగు: సీపీఐ జెండా ఎగురవేస్తున్న సృజన్‌కుమార్


గన్నేరువరంలో జెండా ఆవిష్కరించిన నాయకులు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్
- పార్టీ ఆవిర్భావ వేడుకలు

రామడుగు: మత రాజకీయాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు ప్రతీ కార్యకర్త సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి, గుండి, రామడుగు, గోపాల్‌రావుపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గౌడిశాల తిరుపతిగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గన్నేరువరం: సీపీఐ ఆవిర్భావ వేడుకలను గురువారం గన్నేరువరంలో నిర్వహించారు. పార్టీ నాయకులు జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. సీపీఐ 99 ఏళ్లు పూర్తి చేసుకొని, 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ అన్నారు. పార్టీ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, కోశాధికారి గర్వకుర్తి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నం గ్రామంలో గురువారం సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. పార్టీ జెండాను మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఎగురవేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, రవి, రామస్వామి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: సీపీఐ ఆవిర్భావ వేడుకలను గురువారం సైదాపూర్ మండల కేంద్రంలో నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీసభ్యుడు బత్తుల బాబు జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు వొజ్జ కొమురయ్య, నాయకులు రాజేశం, వెంకటేశ్, శ్రీనివాస్, రవి, సంపత్ తదితరులున్నారు.

చిగురుమామిడి: మండలంలో గురువారం సీపీఐ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. చిగురుమామిడిలోని సీపీఐ భవనం ఎదుట పార్టీ మండలశాఖ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి జెండా ఎగురవేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఇందుర్తి, ఓగులాపూర్ గ్రామాల్లో జిల్లా నాయకులు అందె స్వామి, బూడిద సదాశివ తదితరులు పార్టీలు జెండాలు ఆవిష్కరించారు. సీనియర్ నాయకులను సన్మానించారు.

రాష్ట్రస్థాయి అత్యాపత్యా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు ఎ.కోటేశ్, ఎస్.ప్రణయ్ రాష్ట్రస్థాయి అత్యాపత్యా పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం అనితాకుమారి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.


రిత్విక

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉడుత రిత్విక రాష్ట్రస్థాయి అత్యాపత్యా పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27 నుంచి 29 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. రిత్వికను ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు గురువారం అభినందించారు.

హాకీ టోర్నమెంట్‌కు..


ఎంపికైన క్రీడాకారులు..

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు కరీంనగర్ జట్టులో హుజూరాబాద్ హాకీ క్లబ్ ప్లేయర్స్ ఎంపికయ్యారు. క్రీడాకారులు పల్లపు సాంబరాజు, మోతపోతుల వినయ్, వినీత్, విపుల్, మ్యాదరబోయిన పవన్, ఎ.ఆదిత్య, సాయిమణి, పోలు రాజ్‌కుమార్, సారబుడ్ల సాయి, మిథున్ రెడ్డిలను క్లబ్ శాశ్వత అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సెక్రెటరీ ఉమామహేశ్వర్, ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్, హాకీ క్లబ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్ గురువారం అభినందించారు.

ప్రభుత్వ సలహాదారుకు పుట్టినరోజు శుభాకాంక్షలు


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రమేశ్

హుజూరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్కరించి, తిరుమల శ్రీవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొమ్మాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఉచిత కోచింగ్ వినియోగించుకోండి'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేరవుతున్న బీసీ అభ్యర్థుల కోసం బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి మెగా ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. పూలే జ్ఞాన కేంద్రం పేరిట కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జనవరి 20న ప్రారంభమవుతుందని తెలిపారు. పేద బీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 97014 60698, 98523 74374 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు కరీంరాజు, ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికల భాస్కర్, జిల్లా కన్వీనర్ చిలుకమర్రి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

సైదాపూర్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకట్రాజం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సైదాపూర్ మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కోర్టు తీర్పు అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా కొనసాగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించి, తీర్పునిచ్చిందన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇతర కుల కార్యక్రమాలకు మాదిగ డప్పు మోగించేదిలేదని పేర్కొన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు మిట్టపెల్లి కిష్టయ్య, నాయకులు మ్యాకల రవీందర్, మాజీ సర్పంచ్‌లు కొమురయ్య, లక్ష్మీనారాయణ, రవీందర్, న్యాయవాది వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

చిగురుమామిడి: పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యుడు, సుందరగిరికి చెందిన గుడిపెల్లి రాజు కూతురు వివాహం గురువారం జరుగగా.. కరీంనగర్ డెయిరీ తరఫున పుస్తె, మెట్టెలు అందించారు. సంఘం అధ్యక్షుడు పిట్టల తిరుపతి, డైరెక్టర్లు గండికోట చిన్న శ్రీనివాస్, బట్టు మల్లయ్య, శ్రీమూర్తి శ్రీనివాస్, పెసరి శ్రీనివాస్, పత్తెం రమేశ్, గందె రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సమీపంలో విలాసాగర్‌కు చెందిన సరిసేటి రాజేశ్ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రారంభం

చొప్పదండి: గుమ్లాపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థను గ్రామస్తులు గురువారం ప్రారంభించారు. చైర్మన్ రూపిరెడ్డి స్కైలాబ్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గుర్తింపు తీసుకురావాలి

కరీంనగర్‌రూరల్: సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి, కరీంనగర్ మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి కె. మహేశ్వర్ కోరారు. గురువారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సీఎం కప్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన మండలానికి చెందిన 40 మంది క్రీడాకారులకు ఆర్డీవో స్వయంగా కొనుగోలు చేసిన రూ.31వేల విలువైన క్రీడాదుస్తులు అందజేశారు. అనంతరం పీఈటీలకు విజిల్స్ బహూకరించారు. ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, ఎంఈవో రవీందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

కృష్ణయ్యను కలిసిన బీసీ సంఘాల నాయకులు

విద్యానగర్(కరీంనగర్): రాజ్యసభ సభ్యుడి హోదాలో మొదటిసారి హైదరాబాద్ వచ్చిన బీసీల ఉద్యమకారుడు ఆర్.కృష్ణయ్యను గురువారం బీసీ సంఘాల జేఏసీ కరీంనగర్ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, రాచమల్ల రాజిరెడ్డి, దొగ్గలి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు.

సర్దార్ ఉధమ్ సింగ్‌కు నివాళి


ఉధమ్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం రాత్రి జ్యోతి బాపూలే కమిటీ మాజీ చైర్మన్ సందెల వెంకన్న ఆధ్వర్యంలో సర్దార్ ఉధమ్ సింగ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఉధమ్ సింగ్ చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చందుపట్ల జనార్దన్, జక్కని సంజయ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.